

వాహనం విక్రయిస్తున్నారా..?

వాహనం విక్రయిస్తే జాగ్రత్త పాటించాల్సిందే. కొన్నవారు మారు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందే.

- 8లో



ఈదురుగాలుల బీభత్సం

జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.

- 8లో

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలోని ముస్లిం సోదరులకు ఎస్పీ రాధిక బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 17న ప్రశాంత వాతావరణంలో, కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలన్నారు. ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గోవులను ఒక చోట నుంచి మరొక చోటుకు తరలించే క్రమంలో తగిన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. గోవధ పూర్తిగా నిషేధమని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పనస పండు మోయకుండా బంధువు ఇంటికి వెళ్తే ఉద్దానంలో మహా నేరం. పనస తొన తినిపించకుండా నేస్తం అని చెప్పుకోవడం అక్కడ ఇంకా పాపం. పనస పొట్టు కూర గురించి మాట్లాడకుండా, పనస కాయ బిర్యానీ రుచి చూడకుండా ఉద్దానం గడప దాటడం అసాధ్యం. అందులోనూ ఇది పనస సీజన్. చుట్టాలింటికి వెళ్తూ ఓ ఖర్జూర పనసనైనా బహుమతిగా ఇవ్వకపోతే ఇక్కడి వారు అవమానంగా ఫీలైపోతారు. అధికారుల వద్దకైనా, నాయకుల దగ్గరికైనా పనస తీసుకెళ్తే పనైపోతుందని అంటుంటారు.



పనసపై మనసు

- రుచిలో ఖర్జూర పనసే రారాజు
- ఖరీదైన బహుమతికి ప్రతిరూపం
- జిల్లాలో 1200 ఎకరాల్లో పనస సాగు
- వర్షాలు లేకపోవడంతో తగ్గిన దిగుబడి

ఇచ్ఛాపురం రూరల్:


ఏప్రిల్, మే, జూన్.. ఉద్దానమంతా పనస సువాసనతో నిండిపోయే సీజన్ ఇది. కోటలో ఉండే కోటీశ్వరుడు నుంచి గుడిసెలో ఉన్న పేదవాడికి సైతం అందుబాటులో ఉండే ఏకైక పండు ఈ పనస. ఖరీదైన బహుమతికి ప్రతి రూపంగా పనస పండును పిలుస్తారు. మన జిల్లాలో సుమారు 1200 ఎకరాల్లో సాగు చేసే ఈ పనస చెట్లను కొబ్బరి తోటల్లో, ఖాళీ ప్రదేశం ఉంటే ఇంటి పెరట్లలో విరివిగా పెంచుతారు.



పనస కాయలు

పనసలో పలు రకాలు

జిల్లాలో ఖర్జూరం, కర్పూరం, బురద, నిత్య పనస రకాలను రైతులు పండిస్తుంటారు. పనసలో రారాజు ఖర్జూరం రకం పనస. ఈ పండులో చిన్నచిన్న తొనలు పెళుసుగా ఉంటాయి. ఇవి చాలా తియ్యగా ఉంటూ అధిక మొత్తంలో పీచును కలిగి ఉంటాయి. వాణిజ్య పరంగా ముఖ్యమైనవి. సైజును బట్టి ఈ పండు ధర వంద రూపాయల నుంచి ఐదు వందల రూపాయల వరకు విక్రయిస్తారు. ఇందులో తేనె ఖర్జూరం పనస పండు మరింత ఖరీదు ఉంటుంది. ఇక కర్పూరం, బురద, నిత్య పనసగా పిలిచే వీటిని ప్రస్తుతం రైతులు పక్వానికి చేరకుండానే పిందె దశలో విక్రయిస్తుంటారు. ఈ పనస పిందెలను కూరల్లోకి అధికంగా వినియోగిస్తుండటంతో దళారులు రైతుల వద్ద చెట్టు రూపంలో బేరం చేసి తీసుకుంటారు. పనస పండిన తర్వాత ఎక్కువ రోజులు నిలువ ఉండవు. అయితే వీటిని 11 నుంచి 13 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద నిల్వ ఉంచితే 3 నుంచి 6 వారాల వరకు ఉంటాయి. పండ్లతో పాటు పనస కాయ పైతొక్క తీసి లోపలి భాగాన్ని చిన్నచిన్న ముక్కలుగా కోసి కూర చేస్తారు. దీన్ని పనస పొట్టు కూర అంటారు. ఇండియాతో పాటు నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేషియా, కంబోడియా వియత్నాం దేశాల వారు పనసను వంటల్లో విరివిగా వాడతారు. ఇవేగాక పనస తొనలోని విత్తనాలు(పనస పిక్కలు)ను నిప్పుల మీద కాల్చుకుని తినడం, కూరలు, బిర్యానీలలో వాడడం కూడా ఇక్కడ రివాజు. ప్రస్తుతం ఉద్దానం ప్రాంతం నుంచి బరంపురం, కటక్, భువనేశ్వర్, కటక్‌పూర్, కోల్‌కతా, బిలాయి వంటి ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తుంటారు.



కూరల్లో విరివిగా ఉపయోగించే పనస పిక్కలు

ఆరోగ్యపరంగా..

ఆరోగ్య పరంగా పనసలో పోషకాల గని ఉందంటారు వైద్య నిపుణులు. పనసలో పిండి పదార్థాలు, చక్కెరలు, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. అంతే కాకుండా విటమిన్-ఎ, బి1, బి2, బి3, బి5, బి6, బి9, సీ,ఈతో పాటు కాల్షియం, ఐరన్, సోడియం, పొటాషియం, పాస్పరస్, మెగ్నీషియం, మాంగనీస్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణశక్తిని మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారించే గుణం దీనిలో అధికంగా ఉందని, పొటాషియం ఎక్కువగా ఉన్నందున రక్తపోటును తగ్గిస్తుందని, వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుందని వైద్యులు చెబుతుంటారు.

ఖైదీల ములాఖత్ సమయాల్లో మార్పు

గార: మండలంలోని అంపోలు వద్దనున్న జిల్లా జైలులో ఖైదీలతో కుటుంబ సభ్యులు, స్నేహితులు మాట్లాడే సమయాల్లో మార్పులు చేసినట్లు జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జి. దివాకర్‌నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర జిల్లా జైళ్ల శాఖాధికారి ఉత్తర్వుల మేరకు ఆదివారం నుంచి (ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా) 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మాత్రమే అవకాశం ఇవ్వ డం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈ- ములాఖత్ సదుపాయం ఉందని తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలపై ఆర్డీఓ ఆరా

నరసన్నపేట: వంశధార నదిలో మండల పరిధిలోని మడపాం, బుచ్చిపేటతో పాటు ఇతర చోట్ల ఇసుక అక్రమ తవ్వకాలపై ఆర్డీఓ సీహెచ్ రంగయ్య ఆరా తీశారు. శనివారం మండలం మడపాం వద్ద ఇసుక రీచ్‌ను ఆయన మైన్స్, సర్వే, ఎస్ఈబీ అధికారులతో కలసి తనిఖీ చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలు ఎవరు చేస్తున్నారు. ఎలా చేస్తున్నారు. అక్రమ తవ్వకం దారులకు ఎవరు సహకరిస్తున్నారనే వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినంత వరకూ ఇసుక తవ్వకాలు ఎక్కడా జరగడానికి వీల్లేదని ఈ సందర్భంగా అన్నారు. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే జలుమూరు మండలం పర్లాం ఇసుక ర్యాంపును కూడా పరిశీలించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఇసుక ర్యాంపును మంజూరు చేసేందుకు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తున్నామని, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని అన్నారు. ఆర్డీఓ వెంట ఎస్ఈబీ సీఐ సతీష్ కుమార్ స్థానిక వీఆర్వో అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.



మడపాం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రంగయ్య తదితరులు

• నింగి రంగుల్లో..



సాయంత్రం 4 గంటలకు ఆహ్లాదకరంగా ఉన్న మేఘాలు



సాయంత్రం 5 గంటల సమయంలో ఎరుపు రంగులో..

నాగులవలస-మర్రివలస గ్రామాల మధ్యలో మేఘాలు రంగులు మార్చుకున్న తీరు కనువిందు చేసింది. సాయంత్రం 4 గంటల సమయంలో నలుపు రంగులో కమ్ముకున్న మేఘాలు సాయంత్రం ఐదు గంటలయ్యే సమయానికి ఎరుపు వర్ణంలోకి మారిపోయాయి. - జి.సిగడాం

న్యూస్‌రీల్

మూడు రోజుల్లో బీఎడ్, డిగ్రీ ఆరో సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ మూడో సెమిస్టర్, డిగ్రీ ఆరో సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ ఫలితాలు మరో మూడు రోజుల్లో విడుదల చేయనున్నట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ చెప్పారు. ఎగ్జామినేషన్స్ కార్యాలయంలో శనివారం వివరాలు వెల్లడించారు. ఫలితాల విడుదలకు చివరి దశ పనులు పూర్తి చేశామన్నారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, కళాశాలలకు మార్కుల జాబితాలు అందజేయనున్నట్లు తెలిపారు.

'స్కూళ్లకు పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి'



స్టూడెంట్ కిట్స్ పంపిణీపై ఆరా తీస్తున్న డీఈఓ వెంకటేశ్వరరావు

నరసన్నపేట: పాఠ్య పుస్తకాలు ఉన్న మేరకు అన్ని స్కూళ్లకు పంపిణీ పూర్తి చేయాలని, జాప్యం చేయవద్దని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహెచ్ఎస్ (బోర్డు) స్కూల్‌లో ఉన్న స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలో బుక్స్ పంపిణీపై ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడులను ప్రశ్నించి తెలుసుకున్నారు. ఎన్ని బుక్స్ వచ్చాయి.. ఏయే స్కూళ్లకు పంపిణీ చేశారు, బుక్స్ పంపిణీలో జాప్యం ఎందుకు అవుతుంది అనేదానిపై ఆరా తీశారు. ఇంకా 11 టైటిల్స్ రావాల్సి ఉందని, వచ్చిన మేరకు అన్ని స్కూల్స్‌కు పంపిణీ చేస్తున్నామని ఎంఈఓలు డీఈఓకు వివరించారు. మిగిలిన బుక్స్ కూడా త్వరితగతిన వస్తాయని తెలిపారు. అలాగే స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బూట్లు, యూనిఫాం రావాల్సి ఉందని అన్నారు. అనంతరం డీఈఓ స్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విద్యా బోధనపై అవలంబించాల్సిన పద్ధతులు వివరించారు. టెన్త్ రిజల్ట్‌పై ఆరా తీశారు. ఇప్పటి నుంచే విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. హెచ్ఎం ఎస్.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు బి.బాబూరావు, వై.రవికుమార్, ఎంపీపీ ప్రసాదరావు, ఎం.వాసుదేవరావు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న లోకనాథం మృతదేహం

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన యువకుడు తామాడ లోకనాథం ఈ నెల 12వ తేదీన బుధవారం ఉదయం కువైట్‌లోని మాంగాఫ్ ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని శుక్రవారం కువైట్ నుంచి అధికారులు కేరళకు తీసుకువచ్చారు. శనివారం విశాఖపట్నం వరకు తీసుకురాగా.. స్థానిక తహసీల్దార్ విజయకుమార్ విశాఖపట్నం నుంచి జింకిభద్ర గ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చి తల్లిదండ్రులు చిరంజీవులు, నారాయణమ్మకు అప్పగించారు. లోకనాథం మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అంత్యక్రియల్లో స్థానిక ఎస్ఐ బి.హైమావతి, స్థానిక సర్పంచ్ తామాడ పద్మావతి, స్నేహితులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు మృతదేహాన్ని అప్పగిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

ఒలింపిక్ డే రన్ నిర్వహణకు 19న సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో ఈ నెల 22వ తేదీన నిర్వహించతలపెట్టిన ఒలింపిక్ డే రన్ నిర్వహణ, ఏర్పాట్లపై ఈ నెల 19వ తేదీన సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల మేడపైన ఉన్న జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ సమావేశానికి ఒలింపిక్ సంఘ ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, వివిధ క్రీడాసంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రతినిధులు, డీఎస్‌ఏ కోచ్‌లు, వెటరన్ క్రీడాకారులు, పీడీ, పీఈటీలు, కోచ్‌లు, క్రీడాభిమానులు తరలిరావాలని సాంబమూర్తి కోరారు. ఈ సమావేశానికి కృష్ణదాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, డీఎస్‌ఏ అధికారులు హాజరవుతున్నట్టు చెప్పారు. జూన్ 23వ తేదీన ఒలింపిక్స్ డేగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా ఒలింపిక్ డే రన్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

16 నుంచి ఏయూఈఈటీ రెండో దశ ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య డీపీ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖాళీల వివరాలను ఈ నెల 21వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఇవ్వాలి. రెండో దశ సీట్ల కేటాయింపు ఈ నెల 27న జరుపుతారు. ప్రవేశాలు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

'వాణిజ్య భూములకు నాలా చెల్లించాలి'



భూముల వివరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఎల్.ఎన్.పేట: పంట భూములను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే రెవెన్యూ యాక్టు ప్రకారం, ప్రభుత్వ నిబంధనలకు లోబడి నాలా చెల్లించాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మండలంలోని చింతలబడవంజ సమీపంలో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి పక్కన ఉన్న భూములను శనివారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. వ్యవసాయ భూములను వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు చేసుకున్న దరఖాస్తు ప్రకారం ఆయా భూములను పరిశీలించినట్లు తెలిపారు. సర్వే నంబర్, విస్తీర్ణం, రైతు పేరు తదితర వివరాలను ఆయన పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఎస్.రాణి అమ్మాజీ, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, మండల రెవెన్యూ పరిశీలకులు గవరయ్య, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధుడు మృతి



తీగల త్రినాథ్(ఫైల్)

కవిటి: మండలంలోని గొర్లెపాడుకు చెందిన తీగల త్రినాథ్(80) పాముకాటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 13వ తేదీ రాత్రి త్రినాథ్‌కు తన ఇంటి పరిసరాల్లోనే పాము కాటు వేసింది. వెంటనే ఆయనను సోంపేట సామాజిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చేర్చే ముందే ఆయన మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. సోంపేటలో సకాలంలో వైద్యం అంది ఉంటే బతికి ఉండేవారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులే బాగు చేసుకున్నారు



రైతులే మరమ్మతులు చేసుకుంటున్న కాలువ

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న జెన్నాచెరువుకి సంబంధించిన రెండు కిలోమీటర్ల పొడవు ఉన్న సాగునీటి కాలువను ఆయకట్టు రైతులు బాగు చేసుకున్నారు. రైతులు చందాలు వేసుకుని ఈ పని చేసుకున్నారు. కాలువ బాగులేకపోవడంతో ఛత్రపురం వద్ద ఉన్న సున్నాముది ప్రధాన కాలువ నుంచి జెన్నాచెరువుకు సాగునీరు రావడం లేదు. దీంతో కాలువలో ఉన్నటువంటి బండ రాళ్లు, మట్టి దిబ్బలు, కలుపు మొక్కలను జేసీబీతో తొలగించారు.

యూబీ పరిశ్రమలో ఉద్రిక్తత



యూబీ పరిశ్రమ లోపల సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీఐ రామచంద్రరావు

రణస్థలం: మండలంలోని బంటుపల్లి యూబీ పరిశ్రమలో శనివారం స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయని జేఆర్ పురం సీఐ జి.రామచంద్రరావు, ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో పనిచేస్తున్న వారు 100కు ఫోన్ చేసి పరిశ్రమలో గొడవలు జరుగుతున్నాయని భద్రత కల్పించాలని కోరారు. దీంతో సీఐ, ఎస్ఐ పరిశ్రమలో ఉద్యోగులు, కార్మికులతో మాట్లాడి వాస్తవ పరిస్థితి తెలుసుకున్నారు. లోడింగ్, అన్ లోడింగ్ కార్మికులు, అడ్మిన్ ఉన్నతస్థాయి ఉద్యోగుల మధ్య తలెత్తిన వివాదం తీవ్ర రూపం దాల్చింది. దీంతో ఇరు వర్గాల మధ్య స్వల్ప ఉద్రిక్త చోటు చేసుకోవడంతో పరిశ్రమలో ఉత్పత్తి నిలిచిపోయింది. తదుపరి పోలీసులు పర్యవేక్షణలో సమస్యను కొంతమేర కొలిక్కి తెచ్చారు. ప్రత్యేక పోలీసు బందోబస్తు సిబ్బంది, జేఆర్ పురం పోలీసులు కలిపి 14 మందిని కేటాయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్నారు. గొడవపై తప్ప దాడి జరిగినట్లు ఫిర్యాదు చేయలేదని జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు.

వాహనం విక్రయిస్తున్నారా..?

- జాగ్రత్తగా ఉండాల్సిందే
- 29, 30 ఫారాలే ముఖ్యం



సెకండ్ హ్యాండ్ ద్విచక్రవాహనాలు

పాతపట్నం: కొత్త వాహనాల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అదే సందర్భంలో పాత వాహనాల విక్రయాలు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయి. అయితే పాత వాహనాలు విక్రయించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అత్యవసరం. ఇతరులకు విక్రయించినట్లు సేల్ అగ్రిమెంట్ ఇతర పత్రాలన్నీ సరిగా చూసుకోకుంటే ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో ఇరుక్కోవాల్సి వస్తుంది. ఇటీవల పోలీసులు ఈ-చలానా విధిస్తుండటంతో కూడా చిక్కులు ఎదురవుతున్నాయి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో కేవలం చిన్న బాండు పేపర్‌తో అమ్మకం గురించి ఒప్పందాలు చేసుకుని విక్రయిస్తారు. వాహనాన్ని కొన్న వ్యక్తి తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకోకుండా అలాగే నడిపిస్తే అమ్మిన వ్యక్తికి ఈ-చలానా భారం పడుతుంది. ఈ విషయాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వారు వినే పరిస్థితి ఉండదు. కాగితాలను చూస్తే గానే నమ్మరు. అలాంటప్పుడు సేల్ డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. సరైన అవగాహన లేకపోవడంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. దీంతో అమ్మిన వారేగాక కొన్నవారు కూడా లేనిపోని చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది.

జోరుగా మారు బేరాలు

నగరాల్లో, పట్టణాలతో పాటు ఇటీవల మండల స్థాయిలో కూడా వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మధ్యవర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పది రోజుల్లోపు యాజమాన్య హక్కులను మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే అధికారులు జరిమానాలు విధించే అవకాశం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు.

29,30 ఫారాలే ముఖ్యం

వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం చాలా ముఖ్యమని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. వాటితో పాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాతవాహనం అమ్మేశాక యాజమాన్య హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు అదనపు ఇబ్బందులు ఎదురు కావు. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు ఎక్కువ పన్నులు చెల్లిస్తూనే ఉన్నారు. ఇకనైనా వాహనాన్ని అమ్మిన వెంటనే ఇరువైపుల యాజమాన్య హక్కులను స్పష్టంగా మార్చుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కొన్న వెంటనే మారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పాత వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకుని పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. తప్పనిసరిగా కొనుగోలు దారుడు చూసుకోవాలి.

– వై.శ్రీనివాసరావు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ , పలాస

పత్రాలు లేకుండా వాహనాలు కొనవద్దు..



సెకండ్ హ్యాండ్ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు, సరైన పత్రాలు ఉన్నాయా, లేవా సరిచూసుకోవాలి. ట్రాఫిక్ చలానాలు లేకుండా ఉండే వాహనాలు కొనుగోలు చేయాలి. సరైన పత్రాలు లేకుండా కేసులు పడతాయి.

– నల్లి సాయి, సీఐ, పాతపట్నం

ఈదురుగాలుల బీభత్సం



హిరమండలం: తంపలో ఈదురుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభం



హిరమండలం: తుంగతంపర కాలనీలో నేలకొరిగిన చెట్టు



రోడ్డుకు అడ్డంగా కూలిన చింత చెట్టు

హిరమండలం: మండలంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ తీక్షణమైన ఎండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రానికి ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. దీంతో ఎక్కడికక్కడే చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తంపలో విద్యుత్ స్తంభం కూలిపోయింది. తుంగతంపర కాలనీలో చెట్లు నేలకొరిగాయి.

కూలిన భారీ చెట్టు

సారవకోట: మండల కేంద్రంలో శనివారం వీచిన ఈదురుగాలులకు స్థానిక అంబేడ్కర్ కాలనీ సమీపంలో రోడ్డుకు అడ్డంగా భారీ చింత చెట్టు నేలకూలింది. సారవకోట నుంచి చోడసముద్రం, సింగంవలస, కిడిమి వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ఆ మార్గంలో వాహనదారులు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.

పిడుగు పాటుకు ఆవులు మృతి

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో గల దూబ గౌరినాయుడుకి చెందిన పాడి ఆవు పిడుగు పాటుకు మృతి చెందినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జి.వెంకటరావు తెలిపారు. శనివారం సాయంత్రం పడిన వర్షానికి తోడు పిడుగు పడడంతో రూ. 50 వేలు విలువ గల హెచ్ఎఫ్ ఆవు మృతి చెందినట్లు ఆయన తెలియ జేశారు. రోజూ లాగానే ఆవును మేతకు విడిచిపెట్టారని, పెద్ద వర్షానికి తోడు పిడుగు పడడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. అలాగే మామిడివలస గ్రామంలో గల పైల అప్పలనాయుడుకి చెందిన జెర్సీ ఆవు సైతం పిడుగుపాటుకు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.



కొల్లివలస గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఆవు



మామిడివలస గ్రామంలో పిడుగు పాటుకి గురై మృతి చెందిన ఆవు

'టెన్త్ స్పాట్‌లో లోపాలు సరిదిద్దాలి'



డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న

పొందూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ గణిత పేపర్ల మూల్యాంకన ప్రక్రియలోని లోపాలను సరిదిద్దాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న అధికారులను కోరారు. గత ప్రభుత్వం అందించిన ట్యాబుల్లో ఇంటర్నెట్ ఉపయోగించి నిర్దేశించిన యాప్ ద్వారా పేపర్లు దిద్దాలని సూచనలు ఇచ్చారు. కానీ చాలా ట్యాబుల్లో యాప్ కనిపించడం లేదని, మూల్యాంకనంలో పాల్గొన్న గణిత ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సాంకేతిక సహాయం కోరినా పట్టించుకునే వారు లేకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిన ఉపాధ్యాయులకు అవకాశం లేకుండా పోయిందని చెప్పారు. ప్రస్తుతం ఈ విధానంలోని లోపాలను సవరించిన తర్వాత మాత్రమే ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొంతమంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్ మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్నప్పటికీ దిద్దిన పేపర్లు సబ్మిట్ కావడం లేదని చెబుతున్నారు. కావున సీనియారిటీ ప్రకారం లిస్ట్ తయారు చేసి వారికి తగిన విధంగా శిక్షణ ఇచ్చాక అవగాహన కల్పించిన తర్వాతనే ఈ విధానాన్ని అమలు చేసి ఉంటే బాగుండేదని తెలిపారు. అలా కాకుండా అనవసర ప్రయోగాలు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వడదెబ్బతో విలేకరి మృతి

గార: మండలం కొర్ని గ్రామానికి చెందిన పత్రికా విలేకరి బావాన రమణమూర్తి (60) ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌తో వడదెబ్బతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల మిత్రులతో కలిసి తీర్థయాత్రలకు బస్‌లో వెళ్లగా, శనివారం మధ్యాహ్నం బస్‌లో వడదెబ్బకు గురయ్యారు. సమీప ఆస్పత్రికి తరలించగా వడదెబ్బతో మృతిచెందాడని వైద్యులు తెలిపారు. అక్కడ నుంచి మిత్రులు కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామం కొర్ని తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



రామరాయిలో పట్టుబడిన బెల్లం ఊటతో అధికారులు



చెట్టు కింద పాతిన సామగ్రిని వెలికితీస్తున్న అధికారులు

కాశీబుగ్గ: శ్రీకాకుళం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గంగాధరం ఆదేశాల మేరకు సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బందితో మందస మండలం కొండాలోగాం పంచాయతీ పరిధిలో గల రామరాయి, పట్టులోగాం, ఇంద్రాడ వీధి, టబ్బాగాం తదితర గ్రామాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై దాడులు చేశారు. టబ్బాగాం గ్రామంలో అప్పటికే నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో పలాస డివిజన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర కుమార్ ఇతర సెబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి నాటుసారా తయారీ, రవాణా గురించి గానీ నాటుసారా అమ్మకాలను గురించి గాని 94409 02358 నంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు.

మహిళా డిగ్రీ కళాశాల ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాల గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్ర

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల 2023–24 విద్యా సంవత్సరం 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను శనివారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు విడుదల చేశారు. 2021–22 విద్యా సంవత్సరంలో 618 మంది విద్యార్థినులు ప్రవేశాలు పొంది కాలేజీలో చేరగా 66.8 శాతం ఉత్తీర్ణతతో 413 మంది డిగ్రీ పట్టా పొందేందుకు అర్హత సాధించినట్టు సూర్యచంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నటరాజ భజన కీర్తనలు



అమ్మవారి సన్నిధానంలో భజనలు చేస్తున్న నటరాజ భజన బృంద సభ్యులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సన్నిధిలో శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం తొగరాం గ్రామానికి చెందిన నటరాజ భజన బృందం 25 మంది సభ్యులు అమ్మవారిని స్తుతిస్తూ శనివారం భజనలు చేశారు. భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు భజన బృంద సభ్యులను దుశ్శాలువతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్ వైజర్ ఏడుకొండలు, పైడితల్లి అమ్మవారి దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీకి ఘనంగా నివాళులు



సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సభ

శ్రీకాకుళం కల్చరల్: తన కవితలు, గేయాలతో ప్రజా చైతన్యాన్ని రగిల్చిన మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు అని వక్తలు కొనియాడారు. సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం డే అండ్ నైట్ కూడలి వద్ద కన్వీనర్ కేతవరపు శ్రీనివాసు అధ్యక్షతన శ్రీశ్రీ వర్ధంతి సభ జరిగింది. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి కవులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రబంధ కవిత్వపు సంకెళ్లను తెంచి కవితా సరస్వతికి స్వేచ్ఛ కల్పించిన విప్లవ కవి శ్రీశ్రీ అని అన్నారు. సమాజంలోని కుళ్లను సమూలంగా నిర్మూలించి మరో ప్రపంచం కావాలని దోపిడీ వ్యవస్థలో భూకంపం సృష్టించాడని పేర్కొన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వీజీకే మూర్తి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన లక్ష్యంగా అద్భుత సాహిత్యాన్ని తెలుగు ప్రపంచానికి కందించిన కవి దిగ్గజం శ్రీశ్రీ అని నివాళులర్పించారు. అంతకు ముందు శ్రీశ్రీ గేయాలను చింతాడ రామచంద్రరావు ఆలపించారు. ప్రముఖ కవులు కుప్పిలి వెంకట రాజారావు కంచరాన భుజంగరావు, తంగి ఎర్రమ్మ, వాసవి నెట్టిమి రమణారావు, పత్తి సుమతి స్వీయ కవితా పఠనం చేశారు. కార్యక్రమంలో ఎం.ప్రభాకర్ ఉదయ్ కిరణ్, బాడాన శ్యామల రావు, దివాకర్, మహిళా నాయకులు కె.నాగమణి, ఎ.లక్ష్మీ, డి.సుధామణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిపోతున్న నీరు



ఎచ్చెర్ల ఫ్లై ఓవర్ సమీపంలో నిలిచిన నీరు



చిలకపాలేం సమీపంలో రోడ్డుపై నిలిచిన నీరు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై చిన్న పాటి వర్షానికి సైతం నీరు నిలిచిపోతోంది. దీంతో రోడ్డు పాడవుతోంది. నవభారత్, కింతలిమిల్లు, ఎచ్చెర్ల, చిలకపాలేం సమీపాల్లో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. దీంతో తారు రోడ్డుపై పొరలు ఊడిపోతున్నాయి. రోడ్డు పక్కన డ్రైనేజీ సిస్టం సక్రమంగా లేకపోవడం, కొన్ని చోట్ల రోడ్డు పల్లపు ప్రాంతాల్లో ఉండటం వంటి వాటి వల్ల రోడ్డుపై నీరు నిలిచిపోతోంది.



కింతలిమిల్లు సమీపంలో పాడైన రోడ్డు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.